సాక్షి
అనకాపల్లి
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



అమ్మకు ఎన్ని రూపాలో!

చౌడువాడలో దుర్గాదేవి విగ్రహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. 50మంది కళాకారులు వీటిని సిద్ధం చేస్తున్నారు. 8లో



కృష్ణమయ్య జయంతి

సింహాచలంలో ఆదివారం శ్రీకాంత కృష్ణమాచార్య (కృష్ణమయ్య) జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 8లో



రక్షించిన లైఫ్‌గార్డులు

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో అలల ఉధృతికి ఓ యువకుడు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డులు ప్రాణాలు కాపాడారు.

న్యూస్‌రీల్

సెంట్రల్ జైల్‌లో హీరో నాని



లొకేషన్‌లో నటుడు నాని

కొమ్మాది (విశాఖ): అడవివరం సెంట్రల్ జైల్‌లో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న హిట్–3 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఈ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం నుంచి విశాఖపట్నంలో పలు ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందని సినిమా యూనిట్ తెలిపింది.

పండక్కి ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం (విశాఖ): పండగల వేళల్లో పలు ప్రత్యేక రైళ్లు నడపడంతోపాటు పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం, విశాఖపట్నం–తిరుపతి–విశాఖపట్నం, విశాఖపట్నం–బెంగళూరు–విశాఖపట్నం, విశాఖపట్నం–అరకు–విశాఖపట్నం, విశాఖపట్నం - ఎంజీఆర్ చెన్నై - విశాఖపట్నం, విశాఖపట్నం–షాలిమార్– విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్–తిరుపతి–శ్రీకాకుళం రోడ్, శ్రీకాకుళం రోడ్–కొల్లాం– శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా పలు రెగ్యులర్ రైళ్లకు జనరల్ క్లాస్, స్లీపర్‌క్లాస్, థర్డ్ ఏసీ వంటి కోచ్‌లను అదనంగా జతచేస్తున్నట్లు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ అనన్య, పద్మశ్రీ ఇలియానా సిటలిస్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనన్య బంధోపాధ్యాయ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

స్వామిని దర్శించిన పద్మశ్రీ ఇలియానా సిటరిస్టి

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఒడిశా నృత్యకళాకారిణి ఇలియానా సిటరిస్టి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రసాదాలను ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ అందజేశారు.

ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్



కథ చెబుతున్న స్టోరీ టెల్లర్ సీత

సీతంపేట (విశాఖ): విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ స్కూల్ సంయుక్తంగా పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ ఉత్సాహంగా సాగింది. ప్రముఖ స్టోరీ టెల్లర్ సీత తనదైన శైలిలో పిల్లలకు చక్కని కథలు చెప్పి ఆకట్టుకున్నారు. ఈశాన్య భారతదేశంలోని గారోస్ తెగ సాంప్రదాయ కథలను పిల్లలకు పరిచయం చేశారు. సంగీత వాయిద్యాలు, కళాకృతుల మేళవింపుతో కథకు జీవం పోశారు. క్రాఫ్ట్ యాక్టివిటీలో భాగంగా పిల్లలు పేపర్‌తో నెమలి బొమ్మలు తయారు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది పిల్లలు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ కావట్లే..

- జిల్లాలో 'ఇన్‌స్పైర్ మనక్'కు కరువైన స్పందన
- లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్లు
- అక్టోబరు 15 వరకు గడువు పెంపు
- జిల్లాలో మొత్తం స్కూళ్లు 602
- నమోదు చేసుకున్నవి కేవలం 244

బాలల మెదడు మొక్కకు పూలు పూయాలి.. అవి విజ్ఞాన సౌరభాలను వెదజల్లాలి.. వారిలో సృజనాత్మకత వెల్లివిరియాలి.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి.. ఇదే కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ పోటీల ఉద్దేశం.. భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న కార్యక్రమమిది.. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఇది ఎంతో ప్రోత్సాహం అందిస్తుంది. అయితే విద్యాశాఖ నిర్లిప్తత కారణంగా జిల్లాలో కనీసం సగం పాఠశాలలు కూడా ఇంకా దరఖాస్తు చేసుకోలేదు.



ఈనెల 17న న్యూఢిల్లీలో చోడవరం మండలం లక్ష్మీపురం జెడ్పీ స్కూల్ విద్యార్థిని గుణశ్రీ కీర్తి ప్రదర్శించిన ప్రాజెక్టు

యలమంచిలి రూరల్: నోటిఫికేషన్ వచ్చిందా.. పత్రికా ప్రకటన ఇచ్చేశామా? తమ పని అయిపోయిందా.. అనే విద్యాశాఖ అధికారుల ధోరణి జిల్లాలో విద్యార్థులకు శాపంగా మారింది. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పాఠశాల స్థాయి బాల బాలికల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు నమోదైన రిజిస్ట్రేషన్ల సంఖ్యే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. కేంద్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో రూపొందించిన ఈ కార్యక్రమానికి ఈ ఏడాది జిల్లాలో అనుకున్న స్థాయిలో స్పందన రాలేదు. జిల్లాలో 602 స్కూళ్లు ఉంటే ఇప్పటి వరకు కేవలం 244 స్కూళ్ల నుంచి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల నమోదు ప్రక్రియ జూలై 1న ప్రారంభమై సెప్టెంబర్ 15న ముగిసింది. కానీ తాజాగా గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించారు. ఇప్పటివరకు కేవలం 40 శాతం స్కూళ్ల నుంచి మాత్రమే నామినేషన్ల రిజిస్ట్రేషన్ జరిగాయి. అక్టోబరు 2 నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినందున రిజిస్ట్రేషన్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాల్సి ఉంది. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులను ప్రోత్సహించాల్సి ఉంది. కానీ వీరి నిరాశక్తత కారణంగా నామినేషన్ల నమోదులో రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా వెనుకబడి ఉంది. వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులతో దరఖాస్తు చేయిస్తే వారిలో ఎక్కువ మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది.



యలమంచిలి డివిజన్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, పక్కన గైడ్ టీచర్లు (ఫైల్)



జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనా ప్రదర్శించిన విద్యార్థినులు (ఫైల్)

40 శాతం స్కూళ్ల నుంచి మాత్రమే ఆవిష్కరణల నమోదు

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన కోసం 2024–25 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు స్వీకరించేందుకు ఈ నెల 15తో గడువు ముగిసింది. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు నమోదు కాకపోవడంతో ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పిస్తూ అక్టోబరు 15 వరకు గడువు పొడిగించింది. ఆన్‌లైన్‌లో పాఠశాల అథారిటీ ఆప్షన్‌లోకి వెళ్లి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్‌లో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థి పుట్టిన తేదీ, తల్లి, తండ్రి ఆధార్ సంఖ్య తదితర వివరాలు, బ్యాంకు ఖాతా ఫొటో, తయారు చేసిన ప్రాజెక్టు రైటప్, ప్రాజెక్టు చిత్రాలు లేదా 300 పదాలకు మించని వివరణ అప్‌లోడ్ చేయాలి. ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో రూ.10 వేల నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. రాష్ట్ర స్థాయికి రూ.25 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.40–50 వేల వరకు అందిస్తారు. అక్కడ అర్హత పొందితే రాష్ట్రపతి భవన్‌కు, జపాన్ పర్యటనకు అవకాశం కల్పిస్తారు. చిట్టి బుర్రల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలను రేకెత్తించే ఈ కార్యక్రమాన్ని దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రవేశపెట్టారు. విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించే ఇంత మంచి కార్యక్రమానికి సంబంధించి ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు చొప్పున విద్యార్థులతో ప్రాజెక్టులను రూపొందించాలి. ఇందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించేందుకు సైన్స్ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించాలి. కానీ ఇప్పటివరకు కేవలం 40 శాతం స్కూళ్ల నుంచి మాత్రమే ప్రాజెక్టులు నమోదు కావడాన్ని బట్టి ఈ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోందని తెలుస్తోంది. కరోనాకు ముందు ఏటా నిర్దేశిత సమయంలో ఈ కార్యక్రమం పకడ్బందీగా జరుగుతుండగా కరోనా సమయం నుంచి ఆలస్యమవుతోంది. ఈ విద్యా సంవత్సరం పూర్తి స్థాయిలో ప్రదర్శనలు జరుగుతాయని చెబుతున్నారు. ఇందుకోసం అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఆశించిన స్థాయిలో నామినేషన్లు వెళ్లాల్సి ఉంది. ఆ దిశగా సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులు, ఎంఈవోలు చొరవ చూపించి నామినేషన్ల నమోదు, ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థులు విజయం సాధించేలా చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించాల్సి ఉంది.

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల వివరాలు

జిల్లాల్లో ప్రభుత్వ,ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు	412
జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలలు	190
ఇప్పటి వరకు నామినేషన్లు నమోదు చేసుకున్న స్కూళ్లు	244
నమోదైన ప్రాజెక్టులు	1216

నిర్లక్ష్యం వీడాలి.. అన్ని స్కూళ్లు ప్రాజెక్టులు నమోదు చేయాలి



పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే బృహత్తర కార్యక్రమంపై పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం వీడాలి. జిల్లాలో ఉన్న అన్ని స్కూళ్ల విద్యార్థుల నుంచి ప్రాజెక్టులు నమోదు కావాలి. ఇప్పటికే నిత్యం ఈ విషయాన్ని తరచూ గుర్తు చేస్తున్నాం. అయినప్పటికీ కొందరు ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చూపుతున్నారు. విద్యార్థులతో వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు నమోదు చేయించాలి. నమోదైన ప్రాజెక్టుల్లో 10 శాతం ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఆ విద్యార్థులందరికీ రూ.10 వేలు ఇస్తారు. జిల్లాలో సుమారుగా 2500 నుంచి 3000 వరకు ప్రాజెక్టులు నమోదు చేస్తారని భావిస్తున్నాం. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించి విజయవాడ నుంచి ఢిల్లీ వరకు వసతి, రవాణా, భోజన ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. దసరా సెలవుల నేపథ్యంలో ఉపాధ్యాయులు ప్రాజెక్టుల నమోదుపై విద్యార్థులను సన్నద్ధం చేయాలి.

–దాడి కాళిదాస్, జిల్లా సైన్స్ అధికారి

ఏటా దేశంలో 25 శాతం వరకూ పంట నష్టం

ఆహార నష్ట నివారణపై అంతర్జాతీయ దినోత్సవంలో ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ ముకుందరావు



ఆహార నష్ట నివారణపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: దేశంలో పంటకోత అనంతరం జరిగే వివిధ ప్రక్రియల్లో ఏటా 10 నుంచి 25 శాతం వరకూ నష్టం వాటిల్లుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఆహార నష్ట నివారణపై అంతర్జాతీయ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ ఆహార పదార్థాలలో 2.2 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చెయ్యబడుతుందన్నారు. పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగం అధిపతి డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ పంటకోత అనతరం జరిగే నష్టాలను అరికట్టడానికి ఉపయోగించే ఆధునిక యంత్ర పరికరాలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై వివరించారు. నర్సీపట్నం డివిజన్ ఫుడ్ ఇన్‌స్పెక్టరు రవికుమార్ మాట్లాడుతూ ఆహార పరిరక్షణ ప్రమాణాలు చట్టం, నాణ్యతా ప్రమాణాల చట్టం, ఆహార ప్యాకేజింగ్‌లో ఉండాల్సిన వివిధ అంశాల గురించి వివరించారు. సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి మాట్లాడుతూ మనం పండిస్తున్న పంటలలో మూడో వంతు నష్టం జరుగుతుందన్నారు. ఆ నష్టం సుమారు రూ.92 వేల కోట్లుగా ఉందన్నారు. ఆహార నష్టం ఎక్కువగా ఉన్న దేశాలలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. కొండెంపూడి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆహార వృథా, నష్టాన్ని అరికట్టడం అనేది మన గృహం నుంచే మొదలు పెట్టాలని కోరారు. గృహాల్లో మిగిలిన ఆహారాన్ని అవసరం ఉన్నవారికి అందించడం ద్వారా వృథా తగ్గించవచ్చన్నారు. అనంతరం ఆహార పదార్థాల నివారణ చర్యలు కరపత్రాలను ఏడీఆర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరరావు, కుసుమ, విశాఖ ఉమ్మడి జిల్లాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచ్ఛిష్ట గణపతి లడ్డూ @ రూ.15,15,550



ఆదిబాబుకు లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు

గాజువాక (విశాఖ): ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో ప్రతిష్ఠించిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి స్వామి ప్రసాదం లడ్డూ రూ.15,15,550 పలికింది. స్వామి అనుపోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలం పాట పోటాపోటీగా సాగింది. వేలంలో 16 మంది లడ్డూను దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. చివరకు రూ.15, 15,550కు లడ్డూను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి పప్పల ఆదిబాబు దక్కించుకున్నారు.

పచ్చ మాఫియా ఇసుక దోపిడీ

- తెనుగుపూడి శారదా నదిలో రాత్రి పూట తవ్వకాలు
- తెల్లారకుండానే లారీల్లో తరలించుకుపోతున్న వైనం
- టీడీపీ నేతలకు కాసులు కురిపిస్తున్న ఇసుక అక్రమ రవాణా
- విశాఖలో లారీ ఇసుక రూ. 40 వేల నుంచి రూ.50 వేలకు విక్రయం
- భారీగా తరలిపోతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం



తెనుగుపూడి పంచాయతీ విస్సారపు వీధి సమీపంలో శారదానదిలో ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేస్తున్న మాఫియా



విస్సారపు వీధిలో ట్రాక్టర్లతో తెచ్చి గుట్టలు గుట్టలుగా వేసిన ఇసుక

దేవరాపల్లి: టీడీపీ ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. మండలంలోని తెనుగుపూడి పంచాయతీ పరిధిలోని శారదానదిలో అడ్డూ అదుపు లేకుండా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. శారదానది గర్భంలోకి ట్రాక్టర్లను తీసుకెళ్లి మరీ రాత్రి పగలు తేడా లేకుండా దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. స్థానిక టీడీపీ నేతలే ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న ఇసుక కొరతను తమకు అనుకూలంగా మలుచుకొని పేట్రేగిపోతున్నారు. తెనుగుపూడి పంచాయతీ శివారు విస్సారపు వీధి సమీపంలోని శారదానదిలో ట్రాక్టర్లలో లోడ్ చేసి అక్కడి మంచినీటి ట్యాంక్ వద్ద డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళల్లో లారీల్లో దర్జాగా తరలించుకుపోతున్నారు. శారదానదిలో భారీ గోతులను తవ్వి ఇసుకను లూటీ చేస్తున్నారు. తద్వారా లక్షలాది రూపాయలను జేబుల్లో నింపుకుంటున్నారు. సుమారు నెల రోజులుగా ఈ అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యాడు. పట్టపగలే బరితెగించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా స్థానిక పోలీసులు కాని, రెవెన్యూ అధికారులు కాని కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇలా దోపిడీ చేసిన ట్రాక్టర్ ఇసుకను స్థానికంగా సుమారు 5 వేల నుంచి 6 వేల రూపాయల వరకు విక్రయిస్తుండగా, లారీల్లో విశాఖపట్నం నగర ప్రాంతాలకు తరలించి లారీ ఇసుక 40 వేల నుంచి 50 వేల రూపాయల వరకు విక్రయించి టీడీపీ నాయకులు జేబులు నింపుకుంటున్నారు. వెరసి అక్రమ ఇసుక రవాణా టీడీపీ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇష్టానుసారం శారదానదిలో భారీ గోతులు చేసి, ఇసుక తవ్వకాలు చేపట్టడంతో నది స్వరూపం పూర్తిగా మారిపోయింది. భారీ గోతుల్లో పశువులతో పాటు ప్రజలు సైతం మునిగి మృత్యువాత పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీకి చెందిన ఇసుక మాఫియాతో అధికారులు కుమ్మక్కవడంతోనే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమార్కులను ఉపేక్షించం



ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్ట వేస్తాం. అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వీఆర్వోలు, ఆర్ఐలను పంపించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తీస్తే కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోము.

–పి.లక్ష్మీదేవి, తహసీల్దార్, దేవరాపల్లి

పోటెత్తిన వరద నీరు



రైవాడ జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

అనకాపల్లి జిల్లాలోని రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల్లో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాల కారణంగా ఈ జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతుండడంతో.. ప్రజల భద్రత కోసం అవసరమైన చర్యలు చేపట్టారు. రైవాడ జలాశయం నుంచి శారదా నదిలోకి 2,500 క్యూసెక్కులు, కోనాం జలాశయం నుంచి బొడ్డేరు నదిలోకి 1000 క్యూసెక్కులు, పెద్దేరు జలాశయం నుంచి పెద్దేరు నదిలోకి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయాల నుంచి నీటి విడుదల కారణంగా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని.. ఎవరూ నదులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

- 'రైవాడ'స్పిల్‌వే గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కుల నీరు విడుదల
- పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి కూడా..
- నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

దేవరాపల్లి: రైవాడ జలాశయంలోకి శనివారం రాత్రి నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయిని దాటడంతో నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం ఉదయం స్పిల్‌వే గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా ఆదివారం ఉదయానికి 113.85 మీటర్లకు చేరుకుంది. జలాశయంలోకి 2,500 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతుండగా.. అదే స్థాయిలో శారదా నదిలోకి వరద నీటిని విడుదల చేస్తున్నారు. ముందుగా శనివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఒక గేటు ద్వారా 300 క్యూసెక్కుల విడుదల చేశారు. ఆదివారం ఉదయం అదే గేటు నుంచి 1,500 క్యూసెక్కులను విడుదల చేశారు. సాయంత్రానికి జలాశయంలోకి 2,500 క్యూసెక్కులు వరద నీరు చేరడంతో రెండు గేట్ల ద్వారా అదే స్థాయిలో నీటిని విడుదల చేశారు. జలాశయంలోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదలను తగ్గించడం లేదా పెంచే నిర్ణయాన్ని తీసుకుంటామని డీఈఈ జి. సత్యంనాయుడు తెలిపారు. ప్రస్తుతం శారదానది ఉధృతంగా ప్రవహిస్తోందని.. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు, రైతులు నది దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.



కోనాం జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ప్రమాదస్థాయికి కోనాం జలాశయం

చీడికాడ: కోనాం జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరడంతో ఆదివారం ప్రధానగేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం 101.25 మీటర్లు కాగా.. ఆదివారం ఉదయానికి 100.10 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 1100 క్యూసెక్కులు ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు. ఇన్‌ఫ్లో తగ్గితే.. నీటి విడుదలను తగ్గిస్తామన్నారు. బొడ్డేరు నది పరీవాహక ప్రాంత ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశామని, ఎవరూ నదిలో దిగవద్దని హెచ్చరించామన్నారు.

పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు విడుదల

మాడుగుల: పెద్దేరు జలాశయం నుంచి ఆదివారం సాయంకాలం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలోకి 270 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం ప్రధాన గేటు ద్వారా 300 క్యూసెక్కులు వరద నీరు పెద్దేరు నదిలోకి విడుదల చేశారు. అలాగే పంట కాలువలకు 120 క్యూసెక్కులు సాగునీరు విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు

కె.కోటపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తెలిపారు. ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు వచ్చే నెల ఒకటో తేదీలోగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు. నియమితులైన వారికి ప్రభుత్వ నిబంధన మేరకు వేతనాన్ని అందిస్తామన్నారు.

అప్పన్న సన్నిధిలో పద్మశ్రీ ఇలియానా సిటరిస్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఇలియానా సిటరిస్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఒడిశా నృత్యకళాకారిణి ఇలియానా సిటరిస్తి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రసాదాలను ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ అందజేశారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

అనకాపల్లి: క్రిమిసంహారక మందు సేవించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ సంతోష్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... ప్రకాశం జిల్లా పామర్రు మండలం పుట్టనాయుడుపాలెం గ్రామానికి చెందిన రామవరపు వరహ శ్రీనివాసరావు(34)కు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పట్లోనే ఆరు మాసాల క్రితం కుటుంబ కలహాలు కారణంగా విడిపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం మండలంలోని బీఆర్టీ కాలనీలో తన అక్క రామలక్ష్మి ఇంటికి వచ్చాడు. శనివారం ఆమె బయటకు వెళ్లిన సమయంలో క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన ఆమె గమనించి హుటాహుటిన అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మకు ఎన్ని రూపాలో...!

- చౌడువాడలో జోరుగా దుర్గాదేవి విగ్రహాల తయారీ
- సిద్ధం చేస్తున్న 50 మంది శిల్పకారులు
- తక్కువ ధరకే అమ్మకాలు



శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన దుర్గాదేవి విగ్రహాలు



ఆకట్టుకునే రూపంలో దుర్గాదేవి విగ్రహం



అమ్మవారి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారులు



మహిషాసురమర్ధని రూపంలో దుర్గాదేవి అమ్మవారు

కె.కోటపాడు: బొజ్జ గణపయ్య నవరాత్రోత్సవాలు ముగిశాయి. ఇక దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందడి మొదలు కానుంది. ఇందుకోసం జోరుగా విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. శిల్పులంతా వీటి తయారీలో తలమునకలై ఉన్నారు. కె.కోటపాడు మండలం చౌడువాడలో రెండడుగుల నుంచి ఎనిమిది అడుగుల ఎత్తు వరకూ దుర్గాదేవీ విగ్రహాలను తయారీ చేస్తున్నారు. 16 ఏళ్లుగా ఇక్కడ తయారీ చేస్తున్నారు. సుమారు 50 మంది శిల్పకారులు వివిధ రూపాల్లో ఆకట్టుకునేలా అమ్మవారి విగ్రహాలకు జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది 350 విగ్రహాలను సిద్ధం చేశారు. కొన్నింటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇక్కడ తయారైన వాటిని విశాఖపట్నం, అనకాపల్లి, తదితర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. తక్కువ ధరకే ఆకర్షణీయమైన రూపాల్లో లభిస్తుండటంతో మంచి డిమాండ్ ఉంటోంది.

విగ్రహాల తయారీతో స్వయం ఉపాధి..



ఏటా విజయదశమి పర్వదిన సమయానికి దేవీ విగ్రహాలను తయారీ చేసి అమ్మకాలను చేయడం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. 50 మంది శిల్పకారులు తయారీ చేస్తున్నారు. తద్వారా సొంత గ్రామంలోనే ఉపాధి పొందుతున్నాం. ఇక్కడ తయారీ చేసే విగ్రహాలు ఆకట్టుకునే రూపాలతో ఉండడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. వీరికి తక్కువ ధరకే విగ్రహాలను విక్రయిస్తున్నాం. ఎనిమిది అడుగుల విగ్రహం రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకూ ఉంటుంది.

– ఎం.ఈశ్వరరావు, విగ్రహాల తయారీదారుడు, చౌడువాడ

ముగ్గురికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు: స్థానిక అయ్యన్న ఇంగ్లిష్ మీడియం స్కూలుకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారని స్కూలు కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ ఆదివారం తెలిపారు. ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో శనివారం విశాఖపట్నంలో ఉపాధ్యాయులు బి.సుమతి, ఎస్.రమణ, ఎం.జ్యోతిలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అవార్డులు ప్రదానం చేశారన్నారు. కార్యక్రమం వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో జరిగినట్లు తెలిపారు. ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు పాఠశాల డైరెక్టర్ నూర్జహాన్ అభినందనలు తెలిపారు.

‘ఆరోపణలు అవాస్తవం’

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్–రైతు సాధికారిక సంస్థ ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి, పలువురి సిబ్బందిపై ఇటీవల కొందరు వ్యక్తులు చేసిన ఆరోపణలు అవాస్తవమని, పూర్తిస్థాయిలో విచారణ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన జిల్లా అధికారి లచ్చన్న ప్రకృతి వ్యవసాయంలో పెను మార్పులు చేస్తున్నారని, జిల్లావ్యాప్తంగా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మారలిస్తూ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. జిల్లా అధికారిగా లచ్చన్న నియమితులైనప్పటి నుంచి జిల్లాలో సిబ్బందికి ఎటువంటి సమస్యలు లేవన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈమేరకు 370 మంది సిబ్బంది సంతకాలు చేసి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

విధి నిర్వహణలో బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్టు కార్మికుడు మృతి



బాలరాజు మృతదేహం

కోటవురట్ల: బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ పనులు చేస్తూ గుండెపోటుకు గురై కాంట్రాక్టు కార్మికుడు బాలరాజు మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.రమేష్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటవురట్ల శివారు రాట్నాలపాలేనికి చెందిన పెదపూడి బాలరాజు (29) శనివారం రామచంద్రపురం జంక్షన్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ పనులు చేసే క్రమంలో ఫైబర్ కేబుల్ లాగేందుకు నిచ్చెన పట్టుకుని వెళుతూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతని సహచరులు కోటవురట్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కృష్ణమయ్య జయంత్యుత్సవాలు

సింహాచలం : సింహగిరిపై ఆదివారం నుంచి శ్రీకాంత కృష్ణమాచార్య (కృష్ణమయ్య) జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై వేడుకలను దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కృష్ణమయ్య చిత్రపటానికి పూలమాలవేసి హారతి అందజేశారు. అనంతరం కృష్ణమయ్య కీర్తనలకు పలువురు కళాకారిణులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

బీచ్‌రోడ్డులో కారు బీభత్సం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో ఆదివారం రాత్రి 8.45 గంటల సమయంలో కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలికి చెందిన మీసాల వెంకట్ ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో నగరం నుంచి వస్తున్నారు. అతివేగంగా వస్తున్న వీరి కారు కె.నగరపాలెం దరి గోవుపేట వద్ద అదుపు తప్పి పక్కన వస్తున్న మరో కారును బలంగా ఢీ కొట్టింది. అక్కడ నుంచి డివైడర్‌ను, సెంట్రల్ విద్యుత్ పోల్‌ను, అటుగా వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డివైడర్ ధ్వంసం కాగా విద్యుత్ సెంట్రల్ పోల్ నేలకొరిగింది. కారు నుజ్జునుజ్జవగా ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా, ఆయన కారులో వస్తున్న మరో ఇద్దరు అక్కడ నుంచి పరారయ్యారు. మరో కారులో కేదారిశెట్టి సుభాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇదిలాఉండగా వెంకట్ కారులో మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమస్థానం సాధిద్దాం

ఆరిలోవ: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధించడమే లక్ష్యంగా ప్రజలు భాగస్వాములు కావాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ, ఐఎన్ఎస్ విశ్వకర్మ, ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు సంయుక్తంగా ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా జోడుగుళ్లపాలెం, ఆర్.కె.బీచ్ ప్రాంతాలను శుభ్రం చేశారు. పేపర్లు ప్లేట్లు, ప్లాస్టిక్, ఖాళీ కొబ్బరి బొండాలు తదితర వ్యర్థాలను సేకరించి పారిశుధ్య కార్మికులకు అప్పగించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ ఫ్లకార్డులు, పోస్టర్లతో ర్యాలీ చేశారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోన్–2 జోనల్ కమిషనర్ సింహాచలం, సహాయ వైద్యాధికారులు బి.ప్రసాదరావు, కిశోర్‌కుమార్, ఐఎన్ఎస్ విశ్వకర్మ, ఏయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాహితీ సౌరభం

అనకాపల్లిలో అలరించిన శతాధిక కవి సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేసి కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తదితరులు

అనకాపల్లి: కళల కాణాచిగా పేరొందిన అనకాపల్లిలో సాహితీ సుగంధం పరిమళించింది. కవుల ఊహా ప్రపంచం.. వారి సామాజిక చైతన్యం సాహితీ ప్రియులను అలరించింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం శతాధిక కవి సమ్మేళనం వేడుకగా జరిగింది. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జరిగిన 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 160మంది కవులు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణతోపాటు ఒడిశా రాష్ట్రం, చెన్నై, బెంగళూరు, ముంబయి పట్టణాల నుంచి వచ్చిన తెలుగు కవులెందరో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపేలా కవిత్వం ఉండాలన్నారు. అందుకోసం తమ సంస్థ ద్వారా తెలుగుభాష, సాహిత్యం విస్తరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంస్థ కన్వీనర్ కొల్లి రమావతి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద కవులకు చేయూత అందిస్తూ, పుస్తక ప్రచురణకు ఆర్థికంగా సహకరిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలో త్వరలో పెద్ద ఎత్తున సాహితీ సంబరాలకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.కె.వి.నారాయణరావు ప్రసంగించారు. కళావేదిక జిల్లా అధ్యక్షుడు జి.ఎల్.ఎస్.శాస్త్రి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. 11 జిల్లాల కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయొద్దు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి



ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలో మాట్లాడుతున్న శివారెడ్డి

తుమ్మపాల: ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటుపరం చేయవద్దని.. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రోటరీ క్లబ్‌లో ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రథమ మహా సభ రెండవ రోజు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. జిల్లా కేంద్రంగా ప్రభుత్వ యూనివర్సిటీ లేకపోవడం విద్యను నిర్వీర్యం చేయడమే అన్నారు. వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని.. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమని స్పష్టం చేశారు. హాస్టల్ సమస్యలపై జూన్ నుంచి పోరాటం చేస్తున్నామని.. దీనిపై స్పందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేస్తుంటే.. స్థానిక నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం కళ్లు అప్పగించి చూడడం దారుణమన్నారు. ఇది రాష్ట్ర ప్రజలు, యువకులు, విద్యార్థులను నిలువునా మోసం చేయడమేనన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో విద్యార్థులు ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపైన ఏఐఎస్ఎఫ్ మరింత ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా బి.బాబ్జీ, జి.ఫణీంద్ర కుమార్ ఎన్నికయ్యారు. 31 మంది జిల్లా కమిటీ సభ్యులుగా, 9 మంది ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, నాగభూషణం, ఏఐఎస్ఎఫ్ నాయకుడు రాజన్న దొరబాబు పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్స్ డే



కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లపై మాట్లాడుతున్న దయామణి

తుమ్మపాల: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈ నెల 30న నిర్వహించే డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని ఏపీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కె.దయామణి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వివిధ విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సదస్సు ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దయామణి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో మార్పు రాలేదని వాపోయారు. విద్య, వైద్య అనేక విభాగాల్లో పనిచేస్తున్న వీరిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా వైద్య విభాగంలో పనిచేస్తున్న నర్సింగ్ స్టాఫ్, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులైన డైలీ వేజ్, కంటింజెంట్ తదితర కేడర్ల ఉద్యోగులతో సహా విద్యా రంగంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వీరి సమస్యలను అజెండాగా తీసుకురావడం కోసం డిమాండ్స్ డేగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి. శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల నాయకులు పెంటయ్య, తులసి, సింహాచలం, సూరి అప్పారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు



రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం రైతు కళా భారతి మందిరంలో రెండో రోజు ఆదివారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మేళాలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు ఉత్పత్తులపై ప్రత్యేక విక్రయ శిబిరాలను ఏర్పాటు చేశాయి. ఆర్గానిక్ కూరగాయలు, పిండి వంటలు, ఆయుర్వేద ఉత్పత్తులను పట్టణ వాసులు అధిక సంఖ్యలో వచ్చి కొనుగోలు చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు విచ్చేసి ప్రదర్శన, విక్రయ శాలలను సందర్శించారు. వివిధ ఉత్పత్తి సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. పంటను నేరుగా రైతే విక్రయించుకునే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రైతుల ఉత్పత్తులను నేరుగా సంఘాల ద్వారా మార్కెటింగ్ చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించగలమన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా అధికారి లచ్చన్న, జిల్లా మార్కెటింగ్ ప్రతినిధులు వర్మ, అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృత్యోత్సవం



మాధవపెద్ది మూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు



మహారి నృత్య రూపకం ప్రదర్శిస్తున్న ఒడిశా బృందం

మద్దిలపాలెం: భారతీయ సంప్రదాయ నాట్య ప్రదర్శనలతో కళాభారతి ఆడిటోరియం పులకించిపోయింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాట్యకళాకారులు తమ ప్రదర్శనలతో ఓలలాడించారు. మూడు రోజులుగా జరిగిన వైశాఖీ నృత్యోత్సవ్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమాన్ని సూదగాని రవిశంకర్ నారాయణ్, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్ గౌడ్ తదితరులు ప్రారంభించారు. ఒడిశాకు చెందిన రూపశ్రీ మహాపాత్ర బృందం మహారి నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకోగా..చెన్నైకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య నిపుణుడు, మాధవపెద్ది మూర్తి తన బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు కనువిందు చేశాయి. కేరళకు చెందిన నాట్యశ్రీ బిరుదాంకితురాలు చిత్రా సుకుమారన్ చేసిన మోహినీయాట్టం అలరించింది. డాక్టర్ పేరాల బాల మురళీకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ ప్రతిష్టాత్మక నృత్యోత్సవాల సందర్భంగా ప్రదర్శనానంతరం ఆయా కళాకారులు అవార్డులు అందజేశారు. ప్రఖ్యాత కూచిపూడి నాట్య నిపుణుడు మాధవపెద్ది మూర్తి (చెన్నై) వైశాఖీ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు–2024 అందుకున్నారు. ఒడిశాకు చెందిన నళినీ నిరూర్ నాయక్‌కు, కేరళకు చెందిన మోహినీయాట్టం కళాకారిణి చిత్ర సుకుమారన్‌కు వైశాఖీ ఎక్సలెన్స్ పురస్కారాలు అందజేశారు.

పారా పోటీల్లో దివ్యాంగులు మురిసె.!

- స్విమ్మింగ్ పోటీల చాంపియన్ విశాఖ
- జిమ్నాస్టిక్‌లో చిన్నారుల అద్భుత ప్రదర్శన
- రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన షూటర్లు



జిమ్నాస్టిక్ విజేతలకు బహుమతుల ప్రదానం



పోటీలకు సిద్ధమవుతున్న స్విమ్మర్లు



రైఫిల్ షూటింగ్ చేస్తున్న రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో ఆదివారం క్రీడా పండగ జరిగింది. పారా స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో దివ్యాంగ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దివ్యాంగ స్విమ్మర్లు పూల్‌లో సత్తాచాటగా.. లక్ష్య సాధనలో రైఫిల్ షూటర్లు పోటీపడ్డారు. జిమ్నాస్టులు తమ విన్యాసాలతో అలరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ రైఫిల్ షూటింగ్ చేసి ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ చిన్నారుల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. పారా స్విమ్మింగ్ పోటీల్లో విజేతలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.

స్విమ్మింగ్‌లో...

రైల్వే స్టేడియం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఎస్ 4 కేటగిరీ నుంచి ఎస్ 14 వరకు 90 మంది పారా స్విమ్మర్లు పోటీపడ్డారు. ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్ లాంటి 50, వంద మీటర్ల స్విమ్మింగ్ అంశాల్లో పలువురు దివ్యాంగ స్విమ్మర్లు తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. బ్లైండ్(అంధత్వం) పారా స్విమ్మర్లు సైతం వారి కేటగిరీల్లో పోటీపడి సత్తాచాటారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర జట్టుగా వచ్చే నెల 19 నుంచి 22 వరకు గోవాలో జరిగే పోటీలకు హాజరవుతారు. విశాఖ పారా స్విమ్మర్లు చాంపియన్‌షిప్‌ను సాధించగా.. కృష్ణా జిల్లా స్విమ్మర్లు ద్వితీయస్థానంలో, శ్రీకాకుళం జిల్లా స్విమ్మర్లు తృతీయస్థానంలో నిలిచారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

అలరించిన చిన్నారుల విన్యాసాలు

పాండురంగాపురంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ హాలులో జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమతుల్యత, బలం, చురుకుదనం, సమన్వయం తదితర అంశాలను కళాత్మకంగా ప్రదర్శించి శాప్ ఎండీ, కలెక్టర్‌లను అబ్బురపరిచారు. చిన్నారులు చేసిన ప్రదర్శనను వీరు ఆసక్తిగా వీక్షించారు. వైఎంసీఏ వద్ద జరిగిన రైఫిల్ షూటింగ్‌లో శాప్ ఎండీ క్రీడాకారుడిగా పోటీ పడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జిమ్నాస్టిక్స్‌ను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

దాహం కేకలు..!



రెల్లి కాలనీలో కుళాయిల నుంచి వస్తున్న బురద నీరు



రంగు మారిన బావి నీరు

- జెట్టపురెడ్డితునిలో వేధిస్తున్న తాగునీటి కొరత
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని పంచాయతీ పరిధిలో తాగునీటి కొరత వేధిస్తోంది. గుక్కెడ నీటి కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో జాతీయ రహదారికి రెండు వైపులా ఆనుకొని జెట్టపురెడ్డితుని పంచాయతీ ఉంది. దీన్ని కలిసి పక్కనే నరసింగబిల్లి శివారు గ్రామంగా ఉంది. సుమారు 3500 జనాభా. లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన చిన్నా, పెద్ద రక్షిత మంచినీటి పథకాలు ఐదు వరకు ఉన్నాయి. గ్రామంలో ఎక్కువ శాతం బోర్ల ద్వారా ఉప్పు నీరే వస్తోంది. దీంతో కుళాయిల నీరే తాగునీటికి ఆధారం. గ్రామానికి దూరంగా మంచినీటి బోర్లు తవ్వి, ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. **ఇది భూగర్భంలో తగినంత నీరు లభ్యం కాక అరకొరగా వస్తుండడంతో కుళాయిల నీరు సరిపోక ప్రజలు ఇబ్బంది చెందుతున్నారు. మరోవైపు పైపులైన్లు లీకై ఒక్కోసారి పలు ప్రాంతాలకు బురద నీరు సరఫరా అవుతోంది. రెల్లి కాలనీ, హనుమాన్ కాలనీలకు ఎక్కువగా ఎరువు రంగు నీరు సరఫరా అవుతోందని చెబుతు**న్నారు. వర్షం పడితే మరింత అధ్వానంగా ఉంటుంది. దీంతో ఆ నీటిని తాగలేక వాహనాల రద్దీతో ప్రమాదకరంగా ఉన్న జాతీయ రహదారిని దాటి తెచ్చుకోవలసి వస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కనీసం వాడుకల కోసం స్థానికంగా ఉన్న బావికి వెళ్లినా ఉపయోగం ఉండడం లేదు. రంగుమారి కలుషితమైనా, గత్యంతరం లేక ఆ నీటినే వాడుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి కూడా స్థానికులు తీసుకు వెళ్లారు. ఇప్పటికైనా కుళాయిల ద్వారా సురక్షితమైన నీటిని కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను స్థానికులు కోరుతున్నారు.



జెట్టపురెడ్డితునిలో రక్షిత మంచినీటి పథకం

అధికారులు పట్టించుకోవడం లేదు..



కుళాయిల నుంచి తాగు నీరే కాదు బావిలో వాడుక నీరు రంగు మారి ఉంది. అయినా ఆ నీటినే ఇంటి అవసరాలకు వాడాల్సి వస్తోంది. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేక ఆ నీటిని వాడాల్సి వస్తోంది. దీని వల్ల ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళనగా ఉంది.

– కె.రత్నం, రెల్లి కాలనీ, నరసింగబిల్లి.

తాగునీటి కోసం సతమతం



తాగునీటి కొరతతో సతమతమవుతున్నాం. కుళాయిల నుంచి సరిగ్గా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో తాగునీటి కోసం దూరంగా వెళ్లాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చిట్టూరి భవాని, జెట్టపురెడ్డితుని పంచాయతీ

కలుషిత నీరే దిక్కు



తమ కాలనీలో కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోతోంది. దీంతో ఆ నీటిని తాగలేక ప్రమాదకరమైన జాతీయ రహదారిని దాటి వెళ్లి తాగునీరు తెచ్చుకోవలసి వస్తోంది. మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– తుట్టా సత్యవతి, హనుమాన్ కాలనీ, నరసింగబిల్లి

ఈ ఏడాది ఆఖరుకు సమస్య పరిష్కారం

జెట్టపురెడ్డితుని పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. జల జీవన్ మిషన్ కింద రూ.57 లక్షలతో మరో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం, బోరు ఏర్పాటుతో పాటు 450 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి కృషి చేస్తున్నాం. ఈ ఏడాది ఆఖరుకు పనులు పూర్తి చేయాలనేది లక్ష్యం. ఈ పనులు పూర్తయితే తాగునీటి సమస్య పరిష్కారం కానుంది.

– పావని, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం, కశింకోట

క్లుప్తంగా

అనకాపల్లి ఎక్సైజ్ సీఐగా లక్ష్మణ్‌నాయుడు



లక్ష్మణ్‌నాయుడు

అనకాపల్లి: అనకాపల్లి ఎక్సైజ్ సీఐగా లక్ష్మణ్‌నాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ అనిల్‌కుమార్ సబ్బవరం బదిలీయ్యారు. బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌నాయుడు మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

క్రీడల్లో బాలికల సత్తా



విజేతలతో పీడీ అచ్యుతరావు

కోటవురట్ల: పాములవాక కిల్లాడ రామ్మూర్తి నాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో సత్తా చాటారు. ఈ మేరకు విజేతలను ఆదివారం హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అండర్- 14 బాలికల విభాగం ఖోఖోలో ఎల్.లిఖితమణి, కె.జాహ్నవి, 600 మీటర్ల పరుగు పందెంలో ఎల్.లిఖితమణి తృతీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.రేష్మ, అండర్ -17 బాలికల విభాగం ఖోఖోలో కె.కాశీఅన్నపూర్ణ, ఎల్.వెంకటి, బ్యాడ్మింటన్‌లో ఎన్.దుర్గాభవానీ, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.దుర్గాభవానీ ద్వితీయ స్థానం సాధించారు. వీరంతా జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారని పీడీ అచ్యుతరావు తెలిపారు.

చదువుతో పాటు కళలపై దృష్టి సారించాలి



గీసిన పెయింటింగ్స్‌తో విద్యార్థులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో విద్యార్థి అనే అంశంపై ఆదివారం విద్యార్థులు పెయింటింగ్స్ వేశారు. గుజరాత్ లోని భావనగర్‌లో నిర్వహిస్తున్న రెయిన్ బో ఆర్ట్స్ అకాడమీ పెయింటింగ్స్ పోటీలకు ఈ పెయింటింగ్స్‌ను పంపనున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కళలు దోహదపడతాయని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రామచంద్రరావు తెలిపారు. గ్రంథాల యం డైరెక్టర్ భీశెట్టి తులసీ మాట్లాడుతూ మా ఊళ్లో గ్రంథాలయం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు అవసరమయ్యే శిక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల యం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర : రాజా
మత్తు వదలరా 2 : సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2 : సత్యనారాయణ స్క్రీన్-2
దేవర : పర్తిసాయి
దేవర : వెంకటేశ్వర
దేవర : రామచంద్ర
సత్యం సుందరం : షిర్డీసాయి
ప్రేమికుడు : శ్రీసత్య

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20, ఓ పాజిటివ్-4, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 216 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 199 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

టెట్ మోడల్ పరీక్ష రేపు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా జీవీఎస్ కాంపిటేటివ్ అకాడమీలో మంగళవారం ఉదయం 9 గంటలకు టెట్ మోడల్ పరీక్ష ఉచితంగా నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ జి.సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేపర్ 1, 2 ఆల్ సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తున్నామని, పరీక్ష రాసే అభ్యర్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8179594827, 8179594847 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వ్యాయామంతో ఆరోగ్యం



వైద్యుడు డి.డి.నాయుడిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించవచ్చని వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ వైద్యుడు డి.డి.నాయుడు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం లాంగ్ వాకింగ్ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో అనకాపల్లి షాప్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా తరువాత ప్రతి వ్యక్తికి వ్యాయామంపై ఆసక్తి పెరిగిందన్నారు. ధూమపానం, మద్యపానం, ఒత్తిడి, వ్యాయామం చేయకపోవడం వల్ల హార్ట్ ఎటాక్ వస్తుందన్నారు. వయస్సును బట్టి బరువు పెరగకుండా చూసుకోవాలన్నారు. రోజుకు సుమారుగా 5 లీటర్లు తాగునీరు తీసుకోవాలన్నారు. అనంతరం వాకర్స్ సభ్యులు వైద్యుడు నాయుడిని శాలువాతో సత్కరించి, మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు, సభ్యులు నల్లల దేముళ్లు, జి.కృష్ణమూర్తి, కె.వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

'బస్సు పాసుల్లో రాయితీ తొలగింపు దారుణం'

అనకాపల్లి: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు బస్సు పాసుల్లో రాయితీని తొలగించడం తీరని అన్యాయమని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ అన్నారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, పార్థు వాటర్ సర్వీసింగ్ సెంటర్ సహాయంతో దివ్యాంగులకు ట్రైసైకిల్స్, వీల్‌చైర్స్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి నుంచి విశాఖ తిరిగే మెట్రో బస్సుల్లో దివ్యాంగులకు బస్సు పాసులు అనుమతించకపోవడమే కాకుండా, జిల్లాలో మెట్రో బస్సు పాసులు విశాఖలో సిటీలో అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చిరు ఉద్యోగాల నిమిత్తం రోజూ ప్రయాణం చేసే దివ్యాంగులపై ఎంతో భారం పడుతుందన్నారు. అందులు, బదిరులకు 100 శాతం అంగవైకల్యం ఉంటేనే బస్సు పాసులు ఇస్తామనడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, కోశాధికారి సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిల్, వీల్ చైర్స్ పంపిణీ చేస్తున్న వీరుయాదవ్

పర్తియాత్ర విజయవంతం చేయండి

మాడుగుల: సాయి మహిమను తెలుసుకోవాలని సత్యసాయి జిల్లా సేవా సమితి అధ్యక్షుడు అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక సాయి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. వచ్చే నెల 23, 24, 25 తేదీల్లో అనకాపల్లిలో ప్రశాంతి పర్తి యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.



సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు 'బూడి'కి అభినందనలు



ముత్యాలనాయుడును అభినందిస్తున్న అచ్యుతాపురం మండల వైఎస్సార్‌సీపీ నేతలు

అచ్యుతాపురం(మునగపాక): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆదివారం అచ్యుతాపురం మండలం వైఎస్సార్‌సీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో అందరి సమన్వయంతో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. బూడిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేశంశెట్టి శంకరరావు, ఎంపీపీ కోన సంధ్య భర్త బుజ్జి, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, పార్టీ నేతలు పిన్నమరాజు వాసు, మారిశెట్టి సూర్యనారాయణ, వడిశెల శ్రీనివాసరావు, తదితరులున్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



నరసింగబిల్లి హైస్కూలులో కలుసుకున్న 2011-12 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్‌లో 2011-12 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.

నేడు యలమంచిలి మున్సిపల్ సమావేశం

- రెండున్నర నెలల తర్వాత నిర్వహణ
- పురంలో కుంటుపడిన పాలన
- సమస్యలతో ప్రజలు సతమతం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. చివరి సారిగా ఈ ఏడాది జూలై 12న కౌన్సిల్ సమావేశం జరిగింది. అప్పట్నుంచి రెండున్నర నెలలకు పైగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. వాస్తవానికి ప్రతి నెలా కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉన్నా.. వివిధ కారణాలతో నిర్వహించలేదు. దీంతో పురపాలన కుంటుపడింది. పౌర సేవలు సకాలంలో అందడం లేదు. ఫిర్యాదులు, దరఖాస్తులను పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ సమస్య, వీధి దీపాల ఏర్పాటు, జనన, మరణ ధ్రువ పత్రాలు, ఆస్తి పన్ను పేరు మార్పు, చెత్త సేకరణ, ఇలా వివిధ పౌర సేవలకు సంబంధించి సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర్నుంచి పురపాలక సంఘం కార్యాలయంలో పౌర సేవల దరఖాస్తులు ఎక్కడికక్కడ పేరుకుపోయినా వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలున్నాయి. మరో వైపు పట్టణంతో పాటు శివారు గ్రామాల్లో వీధి కుక్కలు, కోతులు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మరో వైపు దోమల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం, వాటి నివారణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో పట్టణ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. సోమవారం జరగనున్న సమావేశం అజెండా ఇప్పటికే వార్డు కౌన్సిలర్లకు అధికారులు పంపించారు. అయితే ప్రజలెదుర్కొంటున్న సమస్యలు చర్చకు వస్తాయో? లేదో? చూడాలి.



యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

అధ్వానంగా వెంకన్న పుష్కరిణి

- చెత్త, నాచుతో నిండిన కోనేరు
- ఉపమాకపై టీటీడీ చిన్నచూపు

నక్కపల్లి: భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఉపమాక వేంకటేశ్వరస్వామి పుష్కరిణి అధ్వానంగా తయారైంది. కోనేరు నాచు, చెత్తతో నిండిపోయింది. ముందుగా పుష్కరిణిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకోవాలని ఆశపడ్డ భక్తులు నిరాశ చెందుతున్నారు. 9 ఏళ్ల క్రితం ఉపమాకను ఆధీనంలోకి తీసుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఇక్కడి అభివృద్ధిపై చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దత్తత తీసుకునే సమయంలో కోట్లాది రూపాయలతో భక్తుల కోసం పలు అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించిన టీటీడీ.. తర్వాత ఏదో మొక్కుబడిగా కొంత మేర మాత్రమే అభివృద్ధి చేశారు. మొదటి నుంచి స్వామివారి పుష్కరిణిని ఆధునీకీకరించి పవిత్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత భక్తులు కోరుతూనే ఉన్నారు. కానీ టీటీడీ మాత్రం పుష్కరిణి పవిత్రతను కాపాడేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ఆరో శతాబ్దానికి చెందిన ఈ ఆలయానికి ఉత్తర ముఖంగా స్వామివారి పుష్కరిణి(బందుర సరస్సు) ఉంది. ఒకప్పుడు వెంకన్న దర్శనానికి వచ్చే భక్తులు ఈ పుష్కరిణిలో దిగి నీళ్ల నెత్తిన చల్లుకుని సంప్రోక్షణ చేసుకునే వారని చెబుతారు. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు వచ్చే ఇతర ప్రాంతాల భక్తులు ఈ పుష్కరిణిలో స్నానమాచరించిన తర్వాతే స్వామిని దర్శించుకోవడం ఇప్పటికీ ఆనవాయితీగా వస్తోంది. స్వామివారి ఆలయంలో తీర్థం కోసం ఈ జలాలనే తీసుకెళ్లేవారు. అయితే కాలక్రమంలో పుష్కరిణిలో నాచు, చెత్తతో నిండిపోవడంతో అర్చకులు కూడా ఇటీవల ఈ పుష్కరిణిలో నీటిని తీర్థం కోసం ఉపయోగించడానికి ఇష్టపడటం లేదు. పుష్కరిణికి నాలుగు వైపులా నాచు, చెత్త భారీగా పేరుకుపోవడంతో నీటి నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో పుష్కరిణిని అభివృద్ధి చేయాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి స్థానిక నాయకులు విన్నవించుకోగా.. ఆయన స్పందించి టీటీడీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సుమారు రూ.50 లక్షలకు పైగా నిధులతో పుష్కరిణి చుట్టూ రాతికట్టు నిర్మించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతటితోనే పనులు ఆపేశారు. అసలు పని మాత్రం చేపట్టలేదు. పుష్కరిణిలో ఉన్న నీటిని తోడేసి, పూడిక తీసి, నాచు తొలగించి శుభ్రం చేయాలి. తరువాత పవిత్రంగా ఉండేలా పూర్తి స్థాయి రక్షణ చర్యలు చేపట్టాలి. అటువంటి చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు కూడా ఇష్టానుసారం కోనేరులో మునిగి వాటర్ బాటిళ్లను, దుస్తులను వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో పవిత్రంగా ఉండాల్సిన పుష్కరిణి అపవిత్రంగా తయారవుతోందన్న వాదన వినిపిస్తోంది.



నాచు, చెత్తతో నిండి అధ్వానంగా ఉన్న ఉపమాక వెంకన్న పుష్కరిణి

3 నుంచి బ్రహ్మోత్సవాలు

వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తిరుమలలో మాదిరిగానే ఇక్కడ కూడా తొమ్మిది రోజుల పాటు అత్యంత ఘనంగా స్వామివారి తిరువీధి సేవలు, బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించాలని ఆశపడతారు. పుష్కరిణి మాత్రం ప్రస్తుతం చాలా అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి పుష్కరిణిని పవిత్రతను కాపాడుతూ తక్షణమే కోనేరులో పేరుకుపోయిన నాచు, చెత్తను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

3 నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి శరనవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ఉదయం నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు, అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. దాతలు విరాళాలు అందించాలని కోరారు.



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

కోటవురట్ల మండల సర్వసభ్య సమావేశం నేడు

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. వివిధ అభివృద్ధి పనులపై శాఖల వారీ సమీక్ష ఉంటుందని తెలిపారు.

గిరిజనులకు నిత్యావసర సరకుల పంపిణీ

దేవరాపల్లి: భగవాన్ సత్య సాయిబాబా భక్తులు మారుమూల గిరిజనులకు ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. వెంపలనగర్ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి గల్లా శంకరరావు ఆధ్వర్యంలో అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పరిధిలో మాకనాపల్లికి చెందిన 27 గిరిజన కుటుంబాలకు వీటిని అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎటూ వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో వేచలపు రామునాయుడు, రంకిరెడ్డి వెంకటేశ్వర్లు, సూర రామారావు, లెక్కల సత్యనారాయణ, వేచలపు వెంకటరమణమూర్తి తదితర సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.



గిరిజనులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సత్యసాయి భక్తులు